క్లుప్తంగా

క్రీడలతో నాయకత్వ లక్షణాలు



హసన్‌పర్తి: క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని నిట్ ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవికుమార్ అన్నారు. కిట్స్ కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న కిట్స్ ట్రోఫీ ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ రవికుమార్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని వివరించారు. కిట్స్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ఏట డాక్టర్ రమేష్‌రెడ్డి, కేఎంసీ రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ జయచందర్, కిట్స్ ట్రోఫీని నిట్ కైవసం చేసుకుంది. కిట్స్ కళాశాల, ఫిజికల్ విభాగాధిపతి డాక్టర్ ప్రభాకరాచారితో పాటు వివిధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్కార్ గ్రహీతకు అభినందనలు



రామన్నపేట: ఉమ్మడి వరంగల్ జిల్లా చల్లగరిగే ప్రాంతానికి చెందిన ఆస్కార్ అవార్డు గ్రహీత సినీగేయ రచయిత చంద్రబోసును భద్రకాళి దేవస్థాన మాజీ ధర్మకర్త తోనుపునూరి వీరన్న ఆదివారం చల్లగరిగే గ్రామంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు.

జన సంక్షేమం కోసం జనసేన



దేశాయిపేట: జన సంక్షేమమే ధ్యేయంగా జనసేన పనిచేస్తోందని జనసేన జిల్లా నాయకుడు గోళ్ల రాజేంద్రప్రసాద్ అన్నారు. డాక్టర్స్‌కాలనీ-2, వీవర్స్‌కాలనీల్లో వరంగల్ తూర్పు నాయకులు కొల్లూరి అనుదీప్, గుంటుక మహిపాల్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల పక్షాన జనసేన ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. వైద్య శిబిరంలో దాదాపు 500మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గద్దం రాకేష్, రంగినేని రేవంత్, పెరుమాండ్ల దయాకర్, రామంచ దినేష్, మహమ్మద్ ఆసిఫ్, దర్శన్, ప్రేమ్‌కుమార్, జగదీష్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

8వ డివిజన్‌లో జంగా పాదయాత్ర



వరంగల్ క్రైం: హాథ్ సే హాథ్ అభియాన్ యాత్రలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజవర్గంలోని 8వ డివిజన్‌లో మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదివారం పాదయాత్ర చేశారు. పశ్చిమ నియోజవర్గం నుంచి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షాన పోరాటం చేయటానికి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర మాజీ అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్, భరద్వాజ్, రేపల్లె శ్రీనాథ్, జక్కుల రవీందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌కు సన్మానం



ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన పూస శ్రీనివాస్‌ను వరంగల్ ఫోర్ట్‌రోడ్డులో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మైదం రాజు, ఇన్‌ఫార్మా కళాశాల ప్రొఫెసర్ కె.పూర్ణచందర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూస శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

అభివృద్ధి కనిపించడం లేదా?

హన్మకొండ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడినని చెప్పుకునే బండి సంజయ్.. మరోసారి అజ్ఞానాన్ని, అవివేకాన్ని, ఓర్వలేనితనాన్ని, అబద్ధాల కోరుతనాన్ని బయటపెట్టుకున్నారని రెడ్‌కో చైర్మన్ వై.సతీష్‌రెడ్డి దుయ్యబట్టారు. ములుగు వేదికగా బండి పచ్చి అబద్ధాలు మాట్లాడారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేస్తోందని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి తెలంగాణ సర్కారు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దానికి నిదర్శనమే ములుగును జిల్లా కేంద్రం చేయడమని వివరించారు.

కూరగాయల మార్కెట్‌లో భద్రత కరువు

- లక్ష్మీపురం మార్కెట్‌లో నిత్యం టమాట బాక్స్‌లు, సెల్‌ఫోన్లు మాయం
- అపహరణలో హమాలీల హస్తం?
- పట్టించుకోని వ్యాపారుల సంఘం నాయకులు
- ఫిర్యాదుతో విచారణ చేపట్టిన ఇంతేజార్‌గంజ్ పోలీసులు



లక్ష్మీపురం కూరగాయల మార్కెట్



మార్కెట్‌లో ఖాళీ బాక్స్‌లను ఒకచోట పెట్టిన వ్యాపారులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో భద్రత కరువైంది. మార్కెట్‌కు నిత్యం సుదూర ప్రాంతాలైన అనంతపురం, కర్నూలు, మదనపల్లి, కర్ణాటకలోని చింతామణి తదితర ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ పెట్టెల్లో నింపిన టమాటాలను స్థానిక హోల్‌సేల్ వ్యాపారులు డీసీఎం వాహనాల్లో తెప్పిస్తారు. స్థానిక వ్యాపారులు లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ప్లాస్టిక్ బాక్స్‌లను పంపిస్తేనే అక్కడి వ్యాపారులు టమాటాలను ఇక్కడికి పంపిస్తారు. కొనుగోలు చేసిన టమాటాలకు సంబంధించిన డబ్బులు లేకున్నా సరుకులను అక్కడి వ్యాపారులు పంపిస్తారు. అయితే, బాక్స్‌లు లేకుండా టమాటాలు రాదు. పాత మార్కెట్‌లో వేలాది బాక్స్‌లు అపహరణకు గురికాగా, వ్యాపారులు మళ్లీ కొత్తవి కొనుగోలు చేసి టమాట వ్యాపారం సాగిస్తున్నారు.

చోరీకి గురవుతున్న బాక్స్‌లు, సెల్‌ఫోన్లు

టమాటా బాక్స్‌లతో పాటు నిత్యం కూరగాయలు విక్రయించేందుకు వస్తున్న రైతులు, కొనుగోలు చేసేందుకు వస్తున్న వినియోగదారుల సెల్‌ఫోన్‌లు చోరీకి గురవుతున్నాయి. ఇప్పటికి పలుమార్లు సెల్‌ఫోన్ దొంగలను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగిస్తున్నా దొంగతనాలు మాత్రం ఆగడం లేదు. ఇంత జరుగుతున్నా కూరగాయల వర్తక సంఘం నాయకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులందరివి 5వేలకు పైగా టమాటల ప్లాస్టిక్ ఖాళీ బాక్స్‌లు దొంగల పాలయ్యాయని వ్యాపారులు వాపోతున్నారు. మోడల్ మార్కెట్‌లోకి మారినా చోరీలు మాత్రం ఆగడం లేదని చెబుతున్నారు. దాదాపు రూ.15లక్షల వరకు నష్టపోయామని టమాటా వ్యాపారులు అఫ్జల్, భాస్కర్, భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో గత ఐదేళ్లుగా 'పాట' పెట్టి లక్షల రుపాయలు ఆదాయంగా వర్తక సంఘానికి సమకూరిన నిధులను ఏం చేశారన్న విషయంపై వివరాలు చెప్పడం లేదని మిగిలిన వ్యాపారులు ఆరోపిస్తున్నారు. కేవలం రూ.2 లక్షలు - 3 లక్షలు వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే వ్యాపారులందరికి భద్రత ఉండేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

దొంగతనం బయటపడింది ఇలా..

ఇటీవల ఒక రైతు తన తోటలో పండిన టమాటాలను ప్లాస్టిక్ బాక్స్‌ల్లో తీసుకురావడంతో ఇక్కడి టమాట వ్యాపారి ఆ బాక్స్‌లు చోరీకి గురైనవిగా గుర్తించాడు. ఈబాక్స్‌లు ఎక్కడవి అని ప్రశ్నించడంతో సదరు రైతు బాక్స్‌లతో పాటు టమాటాలను వదిలివేసి తన వాహనంలో వెళ్లిపోయాడు. వచ్చిన రైతు కొమ్మాలకు చెందిన వాడని తెలుసుకున్న వ్యాపారులు.. అక్కడకు వెళ్లి నిలదీశారు. మార్కెట్‌లో పనిచేస్తున్న యువకుడు తన వద్దకు తీసుకువస్తే కొనుగోలు చేశానని సదరు హమాలీ పేరును వ్యాపారులకు రైతు చెప్పాడు. ఖాళీ బాక్స్‌లను అమ్ముకున్న యువకుడు హమాలీ సంఘం నాయకుడి సంబంధీకుడు అని తెలియడంతో కూరగాయల వ్యాపారులు అవాక్కయ్యారు. వెంటనే సదరు హమాలీపై ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో తమ టమాటల ఖాళీ బాక్స్‌లు పోయాయని వ్యాపారులు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం బహిర్గతం కావడంతో గతంలో బాక్స్‌లు పోగొట్టుకున్న వారు సైతం ఫిర్యాదు చేస్తున్నారు.

సీసీ కెమెరాలు పెట్టుకోవాలి

లక్ష్మీపురంలో మోడల్ మార్కెట్ ప్రారంభమై వ్యాపారులకు మడిగెలు, చిల్లర వ్యాపారులకు ప్లాట్లు కేటాయించిన తర్వాత ఇంతేజార్‌గంజ్ పోలీసులు మార్కెట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే సరుకులతో నిత్యం ఎలాంటి సంఘటనలు జరిగినా భద్రతపరంగా ఉపయోగకరంగా ఉంటాయని సీఐ మల్లేష్ సూచించారు. హోల్‌సేల్ వ్యాపారులు 95మంది, 30కమర్షియల్ షట్టర్లు, 450 వరకు చిల్లర వ్యాపారులు నిత్యం కూరగాయలు విక్రయిస్తారు. వారంతా కలిసి రూ.వేయి చొప్పున వేసుకున్నా హై రెజల్యూషన్ కెమెరాలు ఏర్పాటు చేయించుకోవచ్చు. వ్యాపారులు సీసీ కెమెరాల విషయంలో మార్కెట్ అధికారులను ప్రశ్నిస్తే మీ భద్రత మీ బాధ్యత అంటూ దాటవేస్తున్నట్లు తెలిసింది. మోడల్ మార్కెట్‌కు ఐదు గేట్లు ఉండడంతో ఎవరు ఎటు నుంచి వస్తున్నారన్న విషయం తెలయకుండా పోయింది. సీసీ కెమెరాలు ఉంటే అన్ని విధాలుగా బాగుంటుందని వ్యాపారులు అంటున్నారు.

భద్రత కరువైంది



మార్కెట్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో భద్రత లేకుండా పోయింది. నిత్యం సెల్‌ఫోన్స్‌లు చోరీకి గురవుతున్నాయి. సీసీ కెమెరాలు ఉంటే టమాటా బాక్స్‌లు దొంగలించే వారిని వెంటనే గుర్తించవచ్చు.

– నవీన్, టమాటల వ్యాపారి

ఉర్సుగుట్ట రంగలీల మైదానం భూమిని కాపాడాలి



రంగలీల మైదానం భూమిని కాపాడాలని రాస్తారోకో చేస్తున్న స్థానికులు

ఖిలా వరంగల్: ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన వరంగల్ ఉర్సుగుట్ట రంగలీల మైదానం భూమిని ప్రభుత్వమే ప్రత్యేక చొరవ తీసుకుని కాపాడాలని దసరా ఉత్సవ కమిటీ బాధ్యులు, స్థానిక కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. అనంతరం, వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే రికార్డులను పరిశీలించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంపంగి రాజు, వరికుప్పల రాజు, రాజమణి, పోచమ్మ పాల్గొన్నారు.

అన్యాక్రాంతమవుతున్న ఎల్లమ్మగుట్టను పరిరక్షించాలి

వరంగల్: నగరంలోని 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి గ్రామ సమీపంలోని ఎల్లమ్మగుట్టను కొంతమంది అన్య మతస్తులు ఆక్రమిస్తున్నారని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని డివిజన్ బీజేపీ అధ్యక్షుడు తిరుపతి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఆయన వాట్సప్‌లో పెట్టిన వీడియో వైరల్ అయింది. గుట్టపై ఉన్న ఎల్లమ్మ విగ్రహాన్ని తీసివేశారని, ప్రస్తుతం అభివృద్ధి జరుగుతున్నందున మళ్లీ ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కాగా, ఈ వీడియోపై ఏనుమాముల పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

విశ్వకర్మలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఆత్మీయ సమ్మేళనంలో వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ద్రావిడ సేవా సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పూసల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. వరంగల్ నగరంలోని గిర్మాజీపేట పద్మశాలిభవన్‌లో విశ్వకర్మల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విశ్వకర్మల పాత్ర చాలా కీలకమైందని గుర్తుచేశారు. ప్రొఫెసర్ జయశంకర్.. సిద్ధాంత వ్యూహాలతో తెలంగాణ సాధించుకున్నట్లు వివరించారు. తెలంగాణలోని కుల సంఘాలు చైతన్యం కావటానికి విశ్వకర్మ వర్గానికి చెందిన మారోజు వీరన్నే కారణం అని అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమానికి తొలి అమరుడు కాసోజు శ్రీకాంతచారి తమకు దిక్సూచి అని తెలిపారు. నేడు ప్రపంచీకరణ పేరుతో కులవృత్తులు అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రికి జయశంకర్ సార్ పేరు పెట్టాలని సూచించారు. ట్యాంక్‌బండ్‌పై శ్రీకాంతాచారి విగ్రహాన్ని నిర్మించాలని, కామ్రేడ్ మారోజు వీరన్నకు స్మృతి వనం ఏర్పాటు చేయాలని కోరారు.

రంజాన్.. పవిత్ర మాసం



విజయ్‌భాస్కర్‌కు పండ్లు తినిపిస్తున్న ముస్లింలు

హన్మకొండ: రంజాన్ పవిత్ర మాసమని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని రోజ్ గ్రాండ్‌లో ఇఫ్తార్ విందు ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ముస్లిం మైనారిటీలతో కలిసి విందు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొక్కిరాల రవీందర్‌రావు, సలహాదారుడు కుందూరు అనిల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.కిశోర్, బీఆర్‌ఎస్ నాయకులు ఇమ్మడి రాజు, మధుకర్, కె.వరప్రసాద్, ఖదీర్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి పైసా ఇవ్వని కేంద్రం



దరువు వేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: రాష్ట్రాభివృద్ధికి తొమ్మిదేళ్ల పాలనలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఒక్కపైసా కూడా ఇవ్వలేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆరోపించారు. నగరంలోని 55వ డివిజన్ భీమారంలోని డీవీఆర్ గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఏటా కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తానని ప్రకటించిన బీజేపీ.. ఇచ్చిన హామీని అమలు చేయలేదని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం మత విద్వేశాలు రెచ్చగొడుతూ యువతను పక్కదారి పట్టిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోల్సింది పోయి వాటిని అమ్ముకుంటోందని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ సర్కార్ తొమ్మిదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొటర్లు జక్కుల రజిత, దివ్యారాణి, సునీల్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ లలితాయాదవ్, కుడా మాజీ చైర్మన్ యాదవరెడ్డి, రైతు బంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్‌బాబు, దేవస్థాన కమిటీ చైర్మన్ లక్ష్మణ్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాయకంటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మట్టల ఆదివారం' పండుగ



గెత్సెమనే చర్చి ఎదుట మట్టలతో చిన్నారులు



రాంపూర్‌లో..

కాజీపేట రూరల్: కాజీపేట పట్టణంలోని పలు క్రైస్తవ మందిరాల్లో మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు జేరుసేలెంలోకి ప్రవేశించినప్పుడు ప్రజలు మట్టలతో జయం పలుకుతూ స్వాగతం పలుకారని దైవజనులు, పాస్టర్లు, లోకరక్షకులు సందేశమిచ్చారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఈస్టర్ పండుగకు ముందు ఆదివారం మట్టల పండుగను జరుపుకుంటారని వివరించారు. అంతకుముందు పిల్లలు మట్టలు పట్టుకుని వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు.

రాంపూర్‌లో..

మడికొండ: మట్టల ఆదివారం పండుగను రాంపూర్‌లో గెత్సెమనే చర్చిలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ఆరోగ్యరాజ్ మాట్లాడుతూ సర్వమానవాళి రక్షకుడు ఏసుక్రీస్తు అని కొనియాడారు.

మహాసభకు తరలిన ఐఎఫ్‌టీయూ శ్రేణులు

ఖిలా వరంగల్: భద్రాద్రి కొత్తగుడెం జిల్లా కేంద్రంలో ఆది, సోమవారం జరగనున్న ఐఎఫ్‌టీయూ మహాసభకు ఖిలా వరంగల్ నుంచి పలు వాహనాలల్లో ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు ఆదివారం తరలివెళ్లారు. ఈమేరకు ఏఐకేఎంఎస్ జిల్లా నేత బాల రాజు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలిరోజు కొత్తగూడెంలో భారీ కార్మికుల ప్రదర్శన ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర జయబాబు, ఊసిల్ల నరసింహం, రాకేష్, ఆకులపల్లి నరేష్, రాములు, ఎర్రస్వామి, సంపత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు, తదితరులు

హన్మకొండ: మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ మహిళా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ వైద్య ఆరోగ్య సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బత్తిని సుదర్శన్ గౌడ్, నెహ్రూ చంద్ నాయక్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో తెలంగాణ వైద్య ఆరోగ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా 2వ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ మహిళా ఉద్యోగినుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు సర్వీస్ వెయిటేజ్ ఇచ్చి డాక్టర్‌ల మాదిరిగా రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని కోరారు. త్వరలోనే ఉద్యోగుల సమస్యలను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో ఐక్యవేదిక రాష్ట్ర కోర్ కమిటీ నాయకులు రామా రాజేష్ ఖన్నా, ఏఎన్‌ఎం అసోసియేషన్ నాయకురాలు సుమతి, ఐక్యవేదిక జిల్లా నాయకులు కె.వేణుగోపాల్ రావు, చుక్క రవికుమార్, వీరేందర్, గోవర్ధన్ రెడ్డి, కె.సంపత్, కృష్ణమూర్తి, సందీప్, ఏఎన్‌ఎం అసోసియేషన్ నాయకులు సాజీన, సామ్రాజ్యం, జ్యోతి, దేవయాని, రమాదేవి పాల్గొన్నారు.

విద్యా, ఆర్థికాభివృద్ధికి ఫౌండేషన్ కృషి



మాట్లాడుతున్న మహ్మద్ అన్వర్

న్యూశాయంపేట: నిరుపేదల ఆర్థిక, విద్యాభివృద్ధి కోసం అయాన్ ఫౌండేషన్ తనవంతు కృషి చేస్తోందని చైర్మన్ మహ్మద్ అన్వర్ అన్నారు. నగరంలోని ఖమ్మం రోడ్డులోని స్లమ్ ఏరియాలో నిరుపేద ముస్లింలకు విద్యా, ఆర్థికాభివృద్ధి కోసం చేయాల్సిన కార్యక్రమాలపై ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ రాజ్‌మహ్మద్ మాట్లాడుతూ విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని అన్నారు. మరో అతిథి సయ్యద్ అక్బర్ మాట్లాడుతూ మైనార్టీ పేదలకు ప్రభుత్వం గురుకులాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీఎస్ – మేసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ తోఫికుర్ రహమాన్, సీఐ కాశీరాం, డాక్టర్ సుష్మిత, మహ్మద్ మదార్ సాబ్, తాహెరా పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి



హన్మకొండ: 60వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ టీచర్స్‌కాలనీ ఫేజ్ -2 లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మట్టపల్లి రాంరాజ్, కాలనీ అధ్యక్షుడు వెంకట్రాజ్యం, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు నరేందర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనాథ్, ఈశ్వర్, రాజిరెడ్డి, దయమంతి, నాయకులు యాదగిరి, నవీన్, అక్మల్, విపుల్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులో ఐనవోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేశబోయిన అరుణ, కల్పలత సూపర్ బజార్ డైరెక్టర్ స్నేహలత, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మట్టపల్లి రాంరాజ్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, నాయకులు శ్రవణ్ కుమార్, సమ్మయ్య, రమేష్, కోటేశ్వర్ పాల్గొన్నారు.

గుడిని సమష్టిగా అభివృద్ధి చేద్దాం

ఖిలా వరంగల్: సత్యనారాయణ గుడిని సమష్టిగా అభివృద్ధి చేసుకుందామని స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి అన్నారు. శివనగర్‌లో బిల్లా రాజు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరి నిర్ణయం మేరకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఇతర దాతల సహకారంతో సత్యనారాయణ ఆలయాన్ని పునర్మాణంతోపాటు అభివృద్ధికి పాటు పడుదామని అన్నారు. కార్యక్రమంలో సతీష్, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. ఈమేరకు వారికి కండువాలు కప్పి పార్టీలోకి కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ఆహ్వానించారు. కార్యక్రమంలో మంతుర్తి కిరణ్, బొంద్యాలు, రవి, జక్కుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కాజీపేట: 62వ డివిజన్ న్యూసోమిడి గ్రామంలో జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈమేరకు వారికి కండువాలు కప్పి పార్టీలోకి జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆహ్వానించారు. కార్యక్రమంలో మేకల శ్రావణ్ కుమార్, భగవాన్‌దాస్ ఉపాధ్యాయ, జీవన్‌ప్రకాష్, కుమార్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సైలు సుమన్, కుమార్, సాంబయ్య నేతృత్వంలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతి మార్గాన్ని అన్వేషిస్తూ కుటుంబంతో కలిసి మంచి జీవితాన్ని గడపాలని సూచించారు. గొడవలు, భూ తగదాల్లో తలదూర్చితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ హెచ్చరించారు. కానిస్టేబుల్ వీరన్న పాల్గొన్నారు.

బహుజనుల మార్గదర్శి సర్వాయి పాపన్న



కాజీపేట అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు



కాజీపేట చౌరస్తాలో ..

కాజీపేట అర్బన్: బహుజనుల మార్గదర్శి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగిద్దామని బీఆర్‌ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాళ్లపెల్లి జనార్దన్‌గౌడ్ తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313వ వర్ధంతి సందర్భంగా హంటర్ రోడ్డులోని గౌడ హాస్టల్ ఆవరణలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనార్దన్‌గౌడ్ మాట్లాడుతూ పాపన్న వర్ధంతిని తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాపన్నగౌడ్ విగ్రహాన్ని హనుమకొండలో ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపా జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజుగౌడ్, బైరి లక్ష్మినారాయణ, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, కుమార్‌స్వామి, సుధాకర్, ప్రకాష్, గౌని సాంబయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు నివాళి

కాజీపేట: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ కాజీపేట చౌరస్తాలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రాజన్‌బాబు, సాంబరాజు, ఫణిందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఎండాకాలంలో కీరదోసకు భలే గిరాకీ



కాజీపేట: ఎండలు మండిపోతుండటంతో దోసకాయలకు గిరాకీ ఎక్కువగా ఉంది. అందులో కీరదోసను తినడానికి ప్రజలు మక్కువ చూపుతున్నారు. వేసవికాలం కావడంతో ఉక్కపోతతో చల్లదనాన్ని ఇచ్చే కాయలు, పండ్లు, జ్యూస్‌ల వైపు జనం మొగ్గు చూపుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో ఎక్కువగా దోసకాయలు, పుచ్చకాయలు ఎక్కువగా తినడానికి ఇష్టపడుతున్నారు. దోసకాయలకు మార్కెట్‌లో కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. తోపుబండ్లపై కీరదోసను కారం, ఉప్పు కలిపి విక్రయించే వ్యాపారులు కాయకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. తోపుడు బండ్లపై కీరదోసను విక్రయించేవారు నగరంలో దాదాపు 50 మందికిపైగానే ఉంటారు.